# సాక్షి నిజామాబాద్

ఆదివారం । 23 । జూన్ । 2024






### వాడీవేడిగా సమావేశం
నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం శనివారం వాడీవేడిగా సాగింది.
- 9లో ▸



### నీట్ పరీక్షను రద్దు చేయాలి
నీట్ పరీక్షను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ఎంపీ అర్వింద్ ఇంటిని ముట్టడించారు.
- 8లో ▸

### వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 35.7 /23.9

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం అవుతుంది. పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

## న్యూస్‌రీల్

### ఎస్సారెస్పీకి 3,183 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు 3,183 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ సీజన్‌లో 3 వేల క్యూసెక్కులు దాటి వరద రావడం ఇదే తొలిసారి. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్ట్‌లోకి రెండు టీఎంసీల నీరు వచ్చి చేరిందని ప్రాజెక్ట్ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. ప్రాజెక్ట్ నుంచి కాలువలు, తాగు నీటి అవసరాలకు, నీటి ఆవిరి రూపంలో 0.89 టీఎంసీల నీరు పోయింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1057.7(8.60 టీఎంసీలు)అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

### 24 నుంచి ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ తృతీయ సంవత్సరం పరీక్షలు ఈ నెల 24 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు సెంటర్ కో ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌తో పాటు తప్పకుండా గుర్తింపు కార్డు తీసుకు రావాలన్నారు. వివరాలకు 7382929612 నంబరును సంప్రదించాలని సూచించారు.

### నేడు నిజాం సాగర్ నీటి విడుదల

రుద్రూర్: బాన్సువాడ నియోజక వర్గ రైతాంగం కోసం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి మేరకు ఆదివారం నిజాం సాగర్ నీటిని విడుదల చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారని జెడ్పీటీసీ నరోజి గంగారాం, మండల నాయకుడు పత్తి లక్ష్మణ్ తెలిపారు. బాన్సువాడ నియోజక వర్గ రైతులు వరినాట్లు ముందుగా వేస్తారని, సాగునీటి అవసరముంటుందన్నారు.

### ప్రారంభమైన పాలిసెట్ కౌన్సెలింగ్



నిజామాబాద్‌అర్బన్: పాలిసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ శనివారం ప్రారంభమైంది. కంఠేశ్వర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 10 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభించినట్లు సమన్వయకర్త శ్రీరామ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన విద్యార్థులు తప్పనిసరిగా వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవాలి. అనంతరం సీటు కేటాయింపు జరుగుతుంది. ఈనెల 27 వరకు వెబ్ ఆప్షన్‌కు గడువు ఉంది. మొదటి రోజు 425 మంది విద్యార్థులకు ధ్రువ పత్రాల పరిశీలన పూర్తయింది.

### ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

నిజామాబాద్‌నాగారం: జిల్లా జనరల్ ఆస్పత్రిలో శనివారం అరుదైన శస్త్ర చికిత్స చేశారు. పది లక్షల మందిలో ఒకరికి వచ్చే వ్యాధిని గుర్తించిన డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్స చేసి మహిళ ప్రాణాలను కాపాడారు. శాటాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళకు ఒంటిపై పెద్ద పెద్ద గడ్డల వల్ల తీవ్ర ఇబ్బందులు పడింది. ఇది కాస్త క్యాన్సర్ వైపు దారి తీసే ప్రమాదం ఏర్పడింది. ఆ మహిళ చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి రాగా ఆమెను డాక్టర్ సునీల్ కుమార్ పరీక్షించారు. వెంటనే మహిళకు శస్త్ర చికిత్స నిర్వహించి ఒంటిపై ఉన్న ఐదు గడ్డలను తొలగించారు. అరుదైన చికిత్స చేయడానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, తోటి వైద్యులు ఎంతో సహకరించారని డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు.



నిఖత్ జరీన్

# వసతులు లేకున్నా.. క్రీడల్లో సత్తా



హుస్సాముద్దీన్

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు
- ప్రభుత్వ కోచ్‌లు లేకున్నా పతకాలు సాధిస్తున్న వైనం
- స్టేడియాలు నిర్మించి వదిలేసిన ప్రభుత్వం
- సౌకర్యాల కల్పనలో అలసత్వం

జిల్లాలో వసతులు లేకున్నా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వ కోచ్‌లు లేకున్నా జాతీయ స్థాయిలో పతకాల పంట పండిస్తున్నారు. అరకొర వసతుల మధ్య పట్టువదలని దీక్షతో సాధన చేస్తూ క్రీడల్లో సత్తా చాటుతున్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు తెస్తామంటున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన క్రీడాకారులు ఉన్నారు. అయినా వసతులు కల్పించడంలో ప్రభుత్వం అలసత్వం చూపుతోంది. జిల్లాలో గత కొన్నేళ్లుగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేసిన దాఖలాలు లేవు. ముఖ్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వచ్చాయి. అరకొర వసతుల మధ్యే ఆయా మైదానాల్లో క్రీడాకారులు రోజూ ప్రాక్టీస్ చేస్తూ ఎదుగుతున్నారు. జిల్లాలో ప్రభుత్వం క్రీడాకారుల కోసం కోచ్‌లను సైతం నియమించలేదు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో రాష్ట్ర స్థాయిలో పతకం సాధించిన క్రీడాకారులకు రూ.2వేలు, జాతీయ స్థాయిలో పతకం సాధించిన క్రీడాకారులకు రూ.5వేలు ప్రోత్సాహం అందించారు. ప్రస్తుతం క్రీడాకారుల గురించి పట్టించుకునే వారు కరువయ్యారు.

సండే స్పెషల్

**స్టేడియాల నిర్మాణంతో సరి**

జిల్లాలో పలుచోట్ల స్టేడియాలు నిర్మించి వదిలేశారు. బోధన్‌లోని శక్కర్‌నగర్‌లో రూ.1.10 కోట్లతో ఏడు ఎకరాల్లో, జక్రాన్‌పల్లి మండలం నారాయణపేట్ వద్ద రూ.2.10 కోట్లతో ఐదు ఎకరాల్లో స్టేడియాలు నిర్మించారు. ఆర్మూర్‌లో రూ.1.05 కోట్లతో 3 ఎకరాల్లో మినీ స్టేడియం కట్టారు. కమ్మర్‌పల్లిలో రూ.2.05 కోట్లతో ఐదు ఎకరాల్లో క్రీడామైదానం ఏర్పాటు చేశారు. వేల్పూర్‌లో రూ.కోటితో ఐదు ఎకరాల్లో క్రీడామైదానం నిర్మించారు. నిజామాబాద్‌లోని నాగారం రాజారాం మైదానానికి రూ.95 లక్షలతో ప్రహరీ నిర్మించారు. మైదానాలను, కొన్ని చోట్ల ఇండోర్ స్టేడియాలను అభివృద్ధి చేసినప్పటికీ కోచ్‌లను నియమించకపోవడం గమనార్హం. అయినప్పటికీ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి పలువురు క్రీడాకారులు ఎదిగారు. ప్రభుత్వాలు భావి క్రీడాకారులకు ప్రోత్సాహం ఇవ్వడం లేదు. అయితే ఆర్చరీ(విలువిద్య)లో మాత్రం ఖేలో ఇండియాలో భాగంగా ఏడాదిగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కోచ్ రవీందర్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ నాగారం మైదానంలో 30 మందికి శిక్షణ ఇస్తున్నారు.

### కలెక్టరేట్ మైదానమే దిక్కు

జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నప్పటికీ క్రీడాభివృద్ధి విషయంలో మాత్రం ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడం లేదు. నగరంలోని క్రీడాకారులకు పాత కలెక్టరేట్ మైదానమే దిక్కయింది. ఏళ్ల తరబడి ఈ ఒక్క మైదానమే క్రీడాకారులకు ఉపయోగపడుతోంది. ఈ మైదానంలోనే హాకీ, బాక్సింగ్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఉషూ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడలకు సీనియర్ క్రీడాకారులు శిక్షణ ఇస్తున్నారు. వారి ఆధ్వర్యంలోనే బాక్సింగ్‌లో నిఖత్ జరీన్, హుస్సాముద్దీన్, ఫుట్‌బాల్‌లో సౌమ్య, హాకీలో యెండల సౌందర్య తదితరులు శిక్షణ తీసుకొని అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు.



నిజామాబాద్ నగరంలోని రాజారాం స్టేడియం

### కోచ్‌లు ఎవరు లేరు..



నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలోనే హాకీలో శిక్షణ తీసుకున్నా. ఈ శిక్షణ ఉన్నత స్థాయికి ఎదిగేలా చేసింది. నాకు ప్రత్యేకంగా కోచ్‌లు ఎవరు లేరు. సీనియర్లు, పీఈటీలు నేర్పించిన ఓనమాల వల్లే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాను. క్రీడాభివృద్ధి కోసం ప్రభుత్వ ప్రోత్సాహం తప్పనిసరి కావాలి.

– యెండల సౌందర్య, భారత హాకీ అండర్–19 జట్టు కోచ్

### ప్రైవేట్ కోచ్ వద్ద శిక్షణ



ఫుట్‌బాల్ క్రీడకు ప్రభుత్వ కోచ్‌లు లేరు. మైదానం కూడా లేదు. ప్రైవేట్ కోచ్ నాగరాజు వద్ద ఫుట్‌బాల్‌లో శిక్షణ తీసుకున్నా. ప్రస్తుతం భారత జట్టులో స్థానం సంపాదించా.

– గుగులోత్ సౌమ్య, ఫుట్‌బాల్ క్రీడాకారిణి



కలెక్టరేట్ గ్రౌండ్‌లో హాకీ ఆడుతున్న క్రీడాకారులు

### క్రీడాభివృద్ధికి పాటుపడాలి



గత ప్రభుత్వం క్రీడాకారులకు, క్రీడా రంగానికి అన్యాయం చేసింది. అంతర్జాతీయ పతకాలు సాధించిన ఇద్దరు, ముగ్గురికి మాత్రమే ప్రోత్సహకాలు ఇచ్చారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు ఉన్నతంగా ఎదుగుతున్నారు. అయినప్పటికీ ఎలాంటి సహాయ సహకారాలు అందించడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం క్రీడాభివృద్ధికి కృషి చేయాలి. – సయ్యద్ ఖైసర్, జాతీయ అథ్లెటిక్స్ గోల్డ్ మెడలిస్ట్, శిక్షకుడు

### ఇక్కడే ఓనమాలు నేర్చుకున్నా

కలెక్టరేట్ మైదానంలో కోచ్ శంషుద్దీన్ వద్ద బాక్సింగ్‌లో ఓనమాలు నేర్చుకున్నా. ఇక్కడ తీసుకున్న శిక్షణతోనే ఈ స్థాయికి వచ్చాను. ప్రస్తుతం ఒలింపిక్స్‌లో పతకం సాధించడానికి కఠోరంగా శ్రమిస్తున్నాను. ప్రభుత్వం క్రీడాకారులకు అండగా నిలవాలి. – నిఖత్ జరీన్, అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారిణి

### ఆర్మీలో విధులు నిర్వహిస్తూ..

నా తండ్రి శంషుద్దీన్ వద్ద బాక్సింగ్‌లో శిక్షణ తీసుకున్నాను. బాక్సింగ్ క్రీడతో ఆర్మీలో ఉద్యోగం వచ్చింది. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే, మరోవైపు పతకాలు సాధిస్తున్నాను. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరెందరో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారు. – హుస్సాముద్దీన్, అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు

### గుర్తింపు ఇవ్వాలి

మాకు ఆర్థిక సహాయం చేయకున్నా.. సౌకర్యాలు కల్పించనప్పటికీ క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పాటుపడుతున్నాం. నాలాంటి ఎంతో మంది కోచ్‌లు క్రీడాకారులకు శిక్షణనిస్తున్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా కోచ్‌లను అభినందించలేదు. ఫుట్‌బాల్‌కు మైదానం లేకుంటే ఖాళీ స్థలాలను అద్దెకు తీసుకుని శిక్షణ ఇస్తున్నాను. పతకాలు సాధించిన తర్వాత ప్రోత్సాహకాలు అందించడం కంటే చిన్నప్పటి నుంచే ఔత్సాహిక క్రీడాకారులకు కోచ్‌లను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలి. – నాగరాజు, ఫుట్‌బాల్ కోచ్

# అల్పాహారంలో బల్లి

- తెయూ బాలికల వసతి గృహంలో ఘటన
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- వంట మనిషి సస్పెన్షన్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బాలికల వసతి గృహంలో అల్పాహారంలో బల్లి వచ్చింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి విద్యార్థినులు తెలిపిన వివరాలు.. శుక్రవారం ఉదయం టిఫిన్ కోసం వెజ్‌బిర్యాని వండారు. ఒక విద్యార్థిని టిఫిన్ చేస్తుండగా వెజ్ బిర్యానీలో బల్లి కన్పించింది. ఆందోళనకు గురైన ఆమె మిగిలిన వారికి ఈ విషయం తెలిపింది. ఘటనపై హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా తాను ప్రస్తుతం స్థానికంగా లేనని తర్వాత చూద్దామని చెప్పారు. హాస్టల్ వార్డెన్ కిరణ్మయి, కేర్‌టేకర్ జమున సైతం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. అప్పటికే సుమారు 120 మంది వరకు టిఫిన్ తిన్నారు. వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొంత సేపటికి విషయం తెలిసిన వర్సిటీ అధికారులు కొందరు ఈ విషయాన్ని బయటకు చెప్పవద్దని ఒత్తిడి చేసినట్లు విద్యార్థినులు ఆరోపించారు. టిఫిన్‌లో బల్లి వచ్చిన తెలిసిన కొందరు విద్యార్థి సంఘాల నాయకులు సైతం వర్సిటీ అధికారులతో కలిసి విషయం బయటకు రాకుండా చూడాలని యత్నించినట్లు తెలిసింది. అయితే రాత్రికి ఒకరిద్దరు విద్యార్థి సంఘాల నాయకులు ఈ విషయాన్ని రిజిస్ట్రార్ యాదగిరి దృష్టికి తీసుకెళ్లారు. ఘటనపై వంట మనిషి రాజేష్‌ను సస్పెండ్ చేసినట్లు రిజిస్ట్రార్ చెప్పడంతో వారు మిన్నకుండి పోయారు. శనివారం ఉదయం ఈ విషయం క్యాంపస్‌లో చర్చనీయాంశమైంది. విషయం వైరల్ కావడంతో కొందరు విద్యార్థి సంఘాల నాయకులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ మీడియాకు ప్రెస్‌నోట్లు పంపించారు.



తెయూ బాలికల హాస్టల్‌లో వెజ్ బిర్యానీలో వచ్చిన బల్లి

### బల్లి కాదు.. కీటకం

బాలికల హాస్టల్‌లో చేసిన టిఫిన్‌లో బల్లి వచ్చిందని శుక్రవారం ఉదయం 10 గంటలకు సమాచారం వచ్చింది. వెంటనే హాస్టల్ వార్డెన్ కిరణ్మయి, కేర్‌టేకర్ జమునను అప్రమత్తం చేశాను. టిఫిన్ పారవేయించి మిగిలిన వారికి తాజాగా వంట చేసి అందించారు. ఘటనపై వార్డెన్, కేర్‌టేకర్ విచారణ జరిపి సాయంత్రం నివేదిక అందజేశారు. వెజ్ బిర్యానీలో వచ్చింది బల్లి కాదు.. ఏదో కీటకం. వంట సామగ్రిలో వచ్చింది. వండేటప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన వంటమనిషి (హెడ్ కుక్) నిర్లక్ష్యంతోనే ఇలా జరిగినట్లు తెలిసింది. ఇన్‌చార్జి వీసీ సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశాల మేరకు వెంటనే హెడ్ కుక్ రాజేష్‌ను విధుల నుంచి తొలగించాము. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా జాగ్రత్త వహిస్తాం. – యాదగిరి, రిజిస్ట్రార్

# 15.3 మి.మీ వర్షపాతం నమోదు

- బాల్కొండలో అత్యధికంగా 6.69 సెంటీమీటర్లు



సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా శనివారం కురిసిన వర్షపాతం 15.3 మిల్లీ మీటర్లుగా నమోదైంది. అత్యధికంగా బాల్కొండలో 6.69 సెంటీమీటర్లు (66.9 మిల్లీ మీటర్లు) కురిసింది. వానాకాలం సీజన్ ప్రారంభమైన తర్వాత జిల్లాలో సగటు వర్షపాతం ఇంత మొత్తంలో నమోదు కావడం ఇదే తొలిసారి. నాలుగు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 15 మండలాల్లో సాధారణం, 11 మండలాల్లో లోటు, 3 మండలాల్లో అతి తక్కువ వర్షపాతం నమోదైందని అధికారులు పేర్కొన్నారు. కాగా వర్షం కురవడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు.

| మండలం | వర్షపాతం | | | | |
|---|---|---|---|---|---|
| నందిపేట్ | 49.2 | సాలూర | 1.8 | రుద్రూర్ | 2.5 |
| ఏర్గట్ల | 48.8 | కమ్మర్‌పల్లి | 23.1 | ఆర్మూర్ | 21.4 |
| డొంకేశ్వర్ | 59.8 | రెంజల్ | 4.3 | ధర్పల్లి | 2.9 |
| మోర్తాడ్ | 29.7 | భీమ్‌గల్ | 7.7 | నిజామాబాద్ రూరల్ | 2.1 |
| మెండోరా | 31.3 | చందూర్ | 2.1 | డిచ్‌పల్లి | 3.5 |
| నవీపేట్ | 3.5 | ఎడపల్లి | 3.2 | మోస్రా | 15.0 |
| ఇందల్వాయి | 12.4 | సిరికొండ | 2.4 | జక్రాన్‌పల్లి | 4.5 |
| ముప్కాల్ | 35.0 | వర్ని | 7.4 | నిజామాబాద్ సౌత్ | 4.5 |
| బోధన్ | 4.9 | ఆలూరు | 22.0 | మోపాల్ | 5.7 |
| బాల్కొండ | 66.9 | వేల్పూర్ | 14.1 | నిజామాబాద్ నార్త్ | 3.9 |
| పోతంగల్ | 2.8 | కోటగిరి | 0.3 | సగటు | 15.3 |
| | | మాక్లూర్ | 5.8 | | |

# ఇక బదిలీల సందడి

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న ఉపాధ్యాయులు
- ఆరేళ్ల తర్వాత బదిలీలకు మోక్షం

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో బదిలీల సందడి మొదలైంది. ఇటీవల పదోన్నతి ప్రక్రియ పూర్తవగా విద్యాశాఖ అధికారులు బదిలీల ప్రక్రియ ప్రారంభించారు. ఉపాధ్యాయుల వివరాలు, దరఖాస్తుల పరిశీలన, ఖాళీలు తదితర అంశాలపై దృష్టి సారించారు. జిల్లాలో 4,896 మంది టీచర్లు ఉన్నారు. జూన్ 1 నాటికి ఒకే చోట రెండేళ్లు పూర్తి చేసుకున్న వారు బదిలీలకు అర్హులు. దీంతో అర్హులైన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. దరఖాస్తుల అనంతరం పరిశీలన చేపట్టి బదిలీల ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

**అన్ని ఖాళీలను కలుపుకొని..**

జిల్లాలో ఇటీవల 860 మంది టీచర్లు పదోన్నతి పొందారు. గత సెప్టెంబర్‌లో పీజీ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. వీటిని పరిగణలోకి తీసుకొని మొత్తం ఖళీల లెక్క తేలుస్తారు. అనంతరం సీనియారిటీ జాబితా, ఖాళీల జాబితా రూపొందిస్తారు. దీనికి అనుగుణంగా అర్హులైన వారి బదిలీల జాబితాను తయారు చేస్తారు. బదిలీలకు సంబంధించి గత సెప్టెంబర్‌లో దరఖాస్తు చేసుకున్న వితంతువులు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి మార్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. బదిలీలకు అవకాశం ఉండి దరఖాస్తు చేసుకోనివారికి అవకాశం ఇవ్వలేదు. బదిలీలకు సంబంధించి 3600 మంది అర్హులుగా ఉన్నట్లు విద్యాశాఖ ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. చాలాకాలం ఒకే చోట పని చేస్తున్న వారిని మొదట బదిలీలకు అర్హులుగా గుర్తించనున్నారు. అనంతరం ఆరోగ్య సమస్యలు తీవ్రంగా ఉన్న వారిని పరిణలోకి తీసుకుంటారు. సీనియరిటీ, ఖాళీల జాబితాను రూపొందించి రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పంపించనున్నారు. అక్కడి నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే ఇక్కడ బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఈ ప్రక్రియ చేపడుతున్నారు. అనంతరం ఇతర జిల్లాల్లో ప్రారంభించే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.



### పారదర్శకంగా చేపడతాం



బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపడుతాం. నిబంధనల ప్రకారం బదిలీలకు సంబంధించిన కసరత్తు జరుగుతోంది. రాష్ట్ర అధికారుల ఆదేశాలకు అనుగణంగా విజయవంతంగా పూర్తి చేస్తాం.

– దుర్గాప్రసాద్, డీఈవో

### సంతోషంగా ఉంది



బదిలీల ప్రక్రియ మొదలవడంతో సంతోషంగా ఉంది. దీంతో ఎంతో మంది టీచర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరగా బదిలీలు పూర్తి చేయాలి.

– బొబ్బిలి లక్ష్మణ్, ఎస్టీటీ

# మహిళాశక్తితో ఆర్థికంగా బలోపేతం

డిచ్‌పల్లి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికే ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు డీఆర్‌డీవో సాయాగౌడ్ తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, టీ– సెర్ప్ ఆధ్వర్యంలో శనివారం డిచ్‌పల్లిలోని టీటీడీసీలో ఏపీఎంలు, సీసీలు, సిబ్బందికి మహిళా శక్తి కార్యక్రమం–మార్గదర్శకాలపై శిక్షణనిచ్చారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ.. వివిధ రకాల బిజినెస్ మోడళ్లను వివరించారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో మహిళాశక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 37 మీ– సేవ కేంద్రాల నిర్వహణను సైతం మహిళా సంఘాల సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాంధించవచ్చన్నారు. జూలై 1 నుంచి 31 వరకు మహిళాశక్తి మాసోత్సవం జరుపుకోవాలన్నారు. జూలై చివరి నాటికి జనరల్ బాడీల నిర్వహణ, బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. అడిషనల్ డీఆర్‌డీవో రవీందర్, డీపీఎంలు శ్రీనివాస్, సంధ్యారాణి, సాయిలు, నీలిమ, రాచయ్య, మారుతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

## క్లుప్తంగా

### శంకర్‌భవన్ పాఠశాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలను డీఈవో దుర్గాప్రసాద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారికి పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఒకటో తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థినులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఉపాధ్యాయుల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో గదుల కొరత ఉందని హెచ్‌ఎం రామచంద్ర గైక్వాడ్ డీఈవో దృష్టికి తీసుకువచ్చారు. కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వాసుదేవరావు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేశ్, సమగ్రశిక్ష సీఎంవో శ్రీనివాసరావు ఉన్నారు.

### తెయూ విద్యార్థికి డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి దోసారప్ విజయ్‌కుమార్ డాక్టరేట్ సాధించారు. తెయూ అధ్యాపకుడు డాక్టర్ వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో 'డిజైన్ అఫ్ హైలీ ఎఫిషియంట్ హెటెరోజెనెస్ కాటలీస్ట్స్ ఫర్ ద సెలెక్టివ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అఫ్ బయోమాస్ డేరివేడ్ ప్లాట్ ఫామ్ మోలేకల్స్ టు వాల్యూ అడేడ్ ప్రాడక్ట్స్ ఈ' అనే అంశంపై విజయ్‌కుమార్ పరిశోధన పూర్తి చేశారు. శనివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ కెమికల్ టెక్నాలజీ, హైదరాబాద్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. పరిశోధకుడిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాధిపతి వాసం చంద్రశేఖర్, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ, అధ్యాపకులు బోయపాటి శిరీష, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. డాక్టరేట్ సాధించిన విజయ్‌కుమార్‌ను రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు అభినందించారు.

### స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలి



ఖలీల్‌వాడి: ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్లు ప్రత్యామ్నాయంగా ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, వారికి స్వచ్ఛంద సంస్థలు సహాయ సహకారాలు అందించాలని జిల్లా జడ్జి సునీతాకుంచాల అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో స్నేహాసొసైటీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ సెక్స్‌వర్కర్లకు నాలుగు నెలలకు సరిపడా బియ్యాన్ని న్యాయమూర్తి శనివారం పంపిణీ చేశారు. డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి, సీనియర్ జడ్జి పద్మావతి, స్నేహ సొసైటీ చైర్మన్ సిద్దయ్య, డీఎల్‌ఎస్‌ఏ సూపరింటెండెంట్ పురుషోత్తం పాల్గొన్నారు.

# నీట్ పరీక్షను రద్దు చేయాలి

- ప్రధాని మోదీ స్పందించాలి
- ఎంపీ అర్వింద్ ఇంటిని ముట్టడించిన విద్యార్థి సంఘాలు

సుభాష్‌నగర్/నిజామాబాద్ అర్బన్: నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పరీక్ష పత్రం లీకేజీతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించకపోవడం సరికాదన్నారు. నగరంలోని సుభాష్‌నగర్‌లోగల ఎంపీ అర్వింద్ ఇంటిని శనివారం ఎన్‌ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐపీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ముట్టడించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య తోపులాట చోటు చేసుకోవడంతో లాఠీఛార్జీ చేశారు. అనంతరం అదుపులోకి తీసుకుని మూడో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, అంజలి, నరేందర్, గౌతంకుమార్, మహేష్, ఏఐపీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకైందని, ఒకే పరీక్షా కేంద్రంలో 8 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. రూ.లక్షలు చేతులు మారాయని, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ఒకే పరీక్షా కేంద్రంలో 67 మందికి ఎలా టాప్ ర్యాంకులు వస్తాయని ప్రశ్నించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకైనట్లు ఇప్పటికే ఆధారాలు వెలుగు చూశాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ స్పందించకపోవడం దుర్మార్గమని ఆరోపించారు. నీట్ ఫలితాలు జూన్ 14న విడుదల చేయాల్సి ఉన్నా.. ఎన్నికల ఫలితాల రోజే ఎందుకు విడుదల చేశారని ప్రశ్నించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకైనందుకు బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేయాలని, ఎన్‌టీఏను రద్దు చేయాలని, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్‌చేశారు. కాగా అరెస్టయిన విద్యార్థి సంఘాల నాయకులను ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌ఛార్జి వెంకటస్వామి పరామర్శించారు. లాఠీఛార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టయిన వారిలో విద్యార్థి నాయకులు శివ, నిఖిల్, జన్నారపు రాజేశ్వర్, సాయికుమార్, విఘ్నేష్, డాక్టర్ గణేష్, ప్రిన్స్, కార్తీక్, సాయినాథ్, నిఖిల్‌రెడ్డి, గణేష్, ఆజాద్, సందీప్ తదితరులున్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



విద్యార్థి సంఘాల నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

# వ్యవసాయ రంగానికి పెద్దపీట

- నేడు జిల్లావ్యాప్తంగా సంబరాలు చేసుకోవాలని పిలుపు
- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి



మోపాల్‌లో పటాకులు కాలుస్తున్న నాయకులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలుపడం హర్షణీయమని, తమది రైతు ప్రభుత్వమని కాంగ్రెస్ మరోసారి నిరూపించిందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటనను హర్షిస్తూ మోపాల్ మండల కేంద్రంలో శనివారం పటాకులు కాల్చి రైతులు, నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ..వానాకాలం సీజన్‌లో పెట్టుబడికి ఇబ్బందులు కలుగకుండా ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వరి సన్నరకాలకు కూడా రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో పదేళ్లు రైతులను మోసం చేసిందని విమర్శించారు. ఏకకాలంలో రుణమాఫీ చేసినందుకు కిసాన్ కాంగ్రెస్ తరపున, రైతాంగం తరపున సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రుణ మాఫీ ప్రకటనను హర్షిస్తూ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్రకమిటీ సూచనల మేరకు ఆదివారం అన్ని మండలాల్లో పాలాభిషేకాలు, టపాకాయలు కాల్చి సంబురాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, రైతులు, నాయకులు గుడి ప్రవీణ్‌రెడ్డి, సాంబయ్య, సతీశ్, లక్ష్మీనర్సయ్య, అర్కల నారాయణ, గణపతి, చిన్నారెడ్డి, రాకేశ్, రాజేశ్, గడల భాస్కర్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లపై దాడులు సరికాదు



వినతిపత్రం అందజేస్తున్న ట్రస్మా నాయకులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలపై విద్యార్థి సంఘాల నాయకుల దాడులను నిరసిస్తూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్(ట్రస్మా)ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానంద్ మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాలు, పాఠశాలల యాజమాన్యాలు కలిసి పని చేస్తే విద్యార్థులకు మంచి విద్య అందించే వీలుంటుందన్నారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థి సంఘాల పేరిట కొంతమంది యువకులు పాఠశాలలపై దాడి చేస్తూ విద్యార్థులను, ఉపాధ్యాయులను, పాఠశాలల యాజమాలను భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాల పేరుతో వచ్చే వారు సైతం తాము విద్యార్థులమేనని విషయాన్ని గుర్తుంచుకోవాలని, భవిష్యత్‌లో ఇలాగే వ్యవహరిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి గోజూరి అరుణ్, పట్టణ అధ్యక్షుడు ధర్మరాజు, కోశాధికారి నాగరాజు, మోహన్, ఆయా మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

# పిల్లలను మొబైల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి

- రాష్ట్ర సైకియాట్రిక్ మహాసభల్లో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు



మానసిక వైద్యులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): చిన్న పిల్లలు అన్నం తినడం లేదని కొందరు తల్లిదండ్రులు వారికి మొబైల్ ఫోన్లు ఇవ్వడం అలవాటు చేస్తున్నారని ఇది పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీకాంత్ రాఠి అన్నారు. మండలంలోని బర్ధిపూర్ శివారులో ఉన్న కృష్ణ హోటల్‌లో ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ (తెలంగాణ), ఇందూర్ న్యూరో సైకియాట్రిక్ హాస్పిటల్, డాక్టర్ విశాల్ డీ అడిక్షన్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర 10వ సైకియాట్రిక్ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ మాట్లాడుతూ.. మొబైల్ ఇవ్వకపోతే పిల్లలు అన్నం తినడం లేదనేది సాకు మాత్రమేనని.. మనం ఫోన్ ఇవ్వకపోయినా ఆకలి వేస్తే వారే తింటారని తెలిపారు. మొబైల్ ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. లేదంటే భవిష్యత్‌లో మానసిక వైద్యుల వద్దకు పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు క్యూ కడతారని పేర్కొన్నారు. అంతకు ముందు గౌరవ అతిథులుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి పాల్గొని మహాసభ మొదటి సెషన్ ప్రారంభించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంత కృషి చేస్తున్నా, డ్రగ్స్ నిర్మూలనకు అందరి సహకారం అవసరమన్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ... భవిష్యత్తులో మానసిక వైద్య విధానానికి మంచి గుర్తింపు ఉంటుందని, సమాజాన్ని బాగుచేయడంలో మానసిక వైద్యుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ప్రముఖ డాక్టర్లు సత్యనారాయణ రావు (మైసూర్), అశోక్ (బెంగళూర్) డాక్టర్ ప్రతిమామూర్తి మట్లాడుతూ.. సమాజంలో మత్తు పదార్థాల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మానసికంగా బాధపడుతున్న వారిని తొందరగా బాగుచేసే విధంగా అందించాల్సిన మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సైకియాట్రిక్ సొసైటీ ప్రధానకార్యదర్శి డాక్టర్ విశాల్, ఆర్గనైజింగ్ చైర్మన్ జార్జిరెడ్డితోపాటు ఆయా జిల్లాల నుంచి మానసిక వైద్యులు పాల్గొన్నారు. అనంతరం మహాసభల సావనీర్‌ను ఆవిష్కరించారు.

# అంగన్‌వాడీ మూసివేతపై విచారణ



ఎడపల్లి(బోధన్): మండలంలోని బ్రాహ్మణపల్లిలో నెల రోజులుగా అంగన్‌వాడీ కేంద్రం మూసి ఉంచడంపై జిల్లా సంక్షేమశాఖ అధికారిణి రసూల్ బీ శనివారం విచారణ చేపట్టారు. గత 12 సంవత్సరాలుగా అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఖాళీగా ఉండగా, ఇన్‌చార్జి టీచర్ల ద్వారా నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం ఎవరూ ముందుకు రాకపోవడంతో కేంద్రాన్ని మూసి ఉంచారు. ఇక్కడి ఆయా రాంబాయిని ఏఆర్‌పీ క్యాంపునకు కేటాయించారు. దీంతో గ్రామస్తులు కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు వచ్చిన సంక్షేమశాఖ అధికారిణి.. గ్రామస్తులు కేంద్రాన్ని నడుపుకుంటే అభ్యంతరం లేదని, ముందుకొచ్చిన వారిలో నుంచి ఒకరికి శిక్షణ ఇస్తామన్నారు. కాగా అధికారులు తీరుపై మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మాజీ ఎంపీటీసీ ప్రమీల మండిపడ్డారు. తమకు తెలుపకుండా కేంద్రాన్ని మూసి ఉంచి అధికారులు మభ్యపెడుతున్నారని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

# సారంగాపూర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం



మహేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

నిజామాబాద్ రూరల్: మండలంలోని సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని రైతులకు అప్పగించి తెరిపిస్తామని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌ను శనివారం ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ కొండెల సాయిరెడ్డి మాట్లాడుతూ.. రానున్న 15 రోజుల్లో సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని రైతులకు అప్పగిస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారన్నారు. వచ్చే నెల ఒకటో తేదీన ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ సభ్యులను హైదరాబాద్‌కు రావాలని సూచించారని, మంత్రులతో మాట్లాడి ఫ్యాక్టరీని తెరిపించే విధంగా చూస్తామన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌పై తమకు నమ్మకం ఉందని ఈ సందర్భంగా సాయిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌ను సన్మానించిన వారిలో సూర్యరెడ్డి, సాయికుమార్, సాయిబాబా, వెంకట్‌రెడ్డి, ముప్పగంగారెడ్డి తదితరులున్నారు.

### కాంగ్రెస్ పార్టీ స్థలం మరొకరి పేరుతో రిజిస్ట్రేషన్

సుభాష్‌నగర్: నగరంలోని హైమదీబజార్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) పేరుతో ఉన్న మడిగె స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకిచ్చారు. అందులోని 43.65 గజాల స్థలాన్ని సబ్ రిజిస్ట్రార్ ఓ వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఎలాంటి పరిశీలన చేయకుండా డీసీసీ స్థలాన్ని ఓ వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ చేయడం చర్చనీయాంశమైంది. ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ ఎవరు? రిజిస్ట్రేషన్ ఉద్దేశపూర్వకంగా చేశారా? లేక పొరపాటు జరిగిందా? అనే అంశాలపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. రిజిస్ట్రేషన్‌ను సత్వరమే రద్దు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి వివరాలు ఆరా తీసి, క్యాన్సిల్ చేసుకోవాలని సూచించినట్లు సమాచారం.

# మురికి కాలువలో పసికందు మృతదేహం

- జిల్లా కేంద్రంలో కలకలం



ఖలీల్‌వాడి: రక్తపు తడి ఆరని ఓ పసికందు మృతదేహం మురికికాలువలో పడిఉన్న దృశ్యం కలిచివేసింది. ఆ తల్లి మోసపోయిందో.. లేక ఆడ పిల్ల పుట్టిందనే కారణమో? ప్రసవం అనంతరం ఆ శిశువు మృతి చెందిందో తెలియదు కానీ.. మురికి కాలువలో పసికందు మృతదేహం పడి ఉండడం కలకలం రేపింది. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ పక్కన గల్లీలో శనివారం ఉదయం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం ఉదయం 6.30గంటలకు మురికికాలువలో పసికందు మృతదేహం కనిపించడంతో స్థానికులకు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్సై ప్రవీణ్ పసికందు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఘటనకు సంబంధించి వివరాలు తెలిస్తే 87126 59839(ఎస్సై), 87126 59836 (సీఐ), 87126 59807(ఏసీపీ) సమాచారం అందించాలని ఎస్సై కోరారు.





## క్రైం కార్నర్

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

భిక్కనూరు: మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామరచెరువు గ్రామం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన యువకుడు మృతిచెందాడు. మల్లుపల్లి తండాకు చెందిన మాలోత్ శ్రీకాంత్ (23) తన సోదరి మౌనికతో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం రామాయంపేటకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. పని పూర్తయిన తరువాత తిరిగి వస్తుండగా దామరచెరువు గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న జేసీబీ ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా, మౌనికకు తీవ్రగాయాలయ్యాయి. మౌనికను చికిత్స నిమిత్తం రామాయంపేట ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ మృతితో మల్లుపల్లి, మల్లుపల్లితండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### ఉపాధ్యాయురాలి ఆత్మహత్య



వీణ మృతదేహం

టీబీపేట: మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాండ్ల వీణ అలియాస్ లాస్య (35) జనగామ గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఎప్పటిలాగే శుక్రవారం విధులకు హాజరై ఇంటికి తిరిగి వచ్చింది. రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్న వీణ.. శుక్రవారం తెల్లవారు జామున ఇంటి వెనుకాల ఉన్న గదిలోకి వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. తండ్రి రామచంద్రం గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందింది. గతంలో కూడా వీణ పలుమార్లు ఆత్మహత్యాయత్నం చేసిందని తండ్రి తెలిపారు. మృతురాలి తండ్రి రామచంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### మద్యానికి బానిసై మరొకరు..

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట ఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని పెద్దమ్మగల్లీకి చెందిన దుబ్బాక బాలరాజు(40) మద్యానికి బానిసై తరచూ భార్యాపిల్లలతో గొడవపడేవాడు. శుక్రవారం భార్య లలిత అనారోగ్యంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా, బాలరాజు ఇంటి వద్దే ఉన్నాడు. శనివారం ఉదయం లలిత తండ్రి ఇంటికి వెళ్లి చూడగా బాలరాజు ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.


### రెండిళ్లలో చోరీ

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్‌లో దుండగులు శుక్రవారం రాత్రి రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన బోర్గాం గంగాధర్‌కు చెందిన దుకాణంలో నుంచి రూ.15వేల నగదు, సాయమ్మ ఇంట్లో నుంచి రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

### ఇరువర్గాల మధ్య ఘర్షణ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): వ్యవసాయ భూమి విషయంలో నెమ్లి గ్రామానికి చెందిన కల్లాలి సతీశ్, అంబం మోహన్ మధ్య గత కొంతకాలంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం పొలం వద్ద మళ్లీ గొడవ జరగడడంతో సతీశ్ వర్గానికి చెందిన వ్యక్తులపై మోహన్‌తోపాటు మరో ఆరుగురు దాడి తీవ్రంగా గాయపరిచినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం బాధితులను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా రెండేళ్లుగా తాము పోలీసు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

### యువకుడి అదృశ్యం



హరికుమార్ (ఫైల్)

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన బత్తిని హరికుమార్(23) అదృశ్యమైనట్లు ఎస్సై కోనారెడ్డి శనివారం తెలిపారు. బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరికుమార్ ఈనెల 9వ తేదీన ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. యువకుడి తండ్రి బత్తిని విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# నిరుద్యోగ యువతకు 'న్యాక్' శిక్షణ

నిజామాబాద్‌నాగారం: ఈజీఎంఎం ద్వారా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు న్యాక్(నేషనల్ అకాడమి అఫ్ కన్‌స్ట్రక్షన్) నిజామాబాద్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, రెండు ఫొటోలతోపాటు పదో తరగతి, ఇంటర్ మెమో, కులం సర్టిఫికెట్ వెంట తీసుకుని న్యాక్‌సెంటర్‌లో ఈనెల 25వ తేదీలోగా సంప్రదించాలని సూచించారు. శిక్షణ సమయంలో శిక్షణ అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి, స్టేషనరీ (బుక్, పెన్), యూనిఫాం(టీ షర్ట్స్-2, బ్యాగ్స్) ఉచితంగా ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ల్యాండ్ సర్వేయర్ విభాగంలో ఆటో లెవెల్, అఫ్ సెట్ సర్వేయింగ్, ట్రవెర్సింగ్, ప్లంబర్ జనరల్ విభాగంలో సోలార్ ఫిట్టింగ్, సీపీవీసీ పైప్ ఫిట్టింగ్, జీఐ పైప్ ఫిట్టింగ్, జనరల్ వర్క్ సూపర్ వైజర్‌లో చైన్ సర్వే, మార్కింగ్, మెజరింగ్, లెవలింగ్, స్కఫోల్డింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు 79813 60101, 99597 73079, 98660 22435, 98663 50200, 62819 92068 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

**శిక్షణ ఇవ్వనున్న కోర్సులు..**

**ల్యాండ్ సర్వేయర్** : ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్హత కలిగి 18 నుంచి 35 ఏళ్ల లోపు వారికి మూడు నెలలపాటు, పదో తరగతి లేదా ఇంటర్ అర్హత ఉన్నవారికి మూడు నెలలపాటు ప్లంబర్, జనరల్ సూపర్‌వైజర్ శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తోపాటు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.

### ముగ్గురు సీఐల బదిలీ

ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లోని మల్టీజోన్-1లోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏ సురేశ్‌ను మల్టీ జోన్-1 అటాచ్ నుంచి సీసీఎస్-1 బదిలీ చేస్తూ పూర్తి బాధ్యతలు అప్పగించారు. నిజామాబాద్ సీసీఎస్ - 1లో ఉన్న ఎం.రమేశ్‌ను ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేయగా, నిజామాబాద్ సీసీఎస్ - 2లో పని చేస్తున్న వి.వీరప్రసాద్ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ టౌన్ సీఐగా బదిలీ అయ్యారు.

### అంత్యక్రియలకు హాజరైన కోదండరాం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు రతన్‌రావు తల్లి సరోజినీదేవి అంత్యక్రియలకు టీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. సరోజినీదేవి అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా రతన్‌రావు కుటుంబసభ్యులను కోదాండరాం పరామర్శించి ఓదార్చారు. అంత్యక్రియల్లో ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### జేఎల్‌ఎం రవి సస్పెండ్

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలో విధులు నిర్వర్తిస్తున్న నాగారం సెక్షన్ ఏఈ సంతకం ఫోర్జరీపై విచారణ చేపట్టిన అధికారులు జేఎల్‌ఎం రవిని సస్పెండ్ చేశారు. సంతకం ఫోర్జరీపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఎస్ రవీందర్ ఆదేశాల మేరకు క్వాలిటీ కంట్రోల్ ఏడీఈ చక్రవర్తి విచారణ చేపట్టారు. మీటర్ మంజూరు ఫైల్‌పై ఏఈ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతోపాటు జేఎల్‌ఎం సంతకం ఉన్నట్లు గుర్తించి నివేదికను ఎస్‌ఈకి అందించారు. నివేదిక ఆధారంగా జేఎల్‌ఎంను సస్పెండ్ చేస్తూ డీఈ శ్రీనివాస్‌రావు నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారించేందుకు వరంగల్ ఎన్‌పీడీసీఎల్ నుంచి అధికారులు జిల్లాకు రానున్నారు. అసలు మీటర్ ఏఈ లాగిన్ నుంచి బయటకు రాకముందే టవర్‌కు ఏ విధంగా బిగించారు? ఆఫీసు నుంచి మీటరును ఎవరు ఇచ్చారు? అనే అంశాలపై స్పష్టతరానుంది. అయితే కేవలం జేఎల్‌ఎంను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటారో.. నిక్కచ్చిగా విచారణ చేపట్టి నిజాలు బయటకు తెస్తారో అనే అంశంపై శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.